వ్యత్యయము

వేలూరి శివరామశాస్త్రి గారు

౧

*అగ్రహారీకుఁడైన నరసింహులుకు మొదటి నుండియు మాలకాటఁడు పాలేరు. ఇప్పుడిరువురికి ఎనుబదేండ్లు.

కాటఁడు నమ్మిన బంటు. నరసింహులను దొంగలు కొట్టినపుడు కాటఁడు ఆ దెబ్బలనన్నియు తానే తినెను. పని పట్టినపుడు పలుతూరులు ముసురు రేలలో కాఱడవుల పయనించి దొర కార్యములు సాధించెను. ఊరంతయు కాలిపోవుచున్నపుడు తన శరీరము కాలినను లెక్కగొనక దొరయిల్లు కాపాడెను. అతఁడు తన దొరమీాద ఈఁగను వాలనీయలేదు.

నరసింహులుకూడ కాటని కఱవులలో కాపాడెను. పెండ్లి పేరంటములు చేసెను. ఇల్లు కట్టించిపెట్టెను. అన్నవస్త్రము లిచ్చెను. ఇటులు దొరవలన పాలేరును పాలేరువలన దొరయు అభివృద్ధి చెందిరి.

ప్రాయము చెల్లినపయిని దొరకు సోములను కొడుకును పాలేరునకు రాముఁడను కొడుకును గలిగిరి; కాని పాలేరు పెండ్లాము ప్రసవించి మరణించెను. నరసింహుల ప్రోద్బలమున కాటఁడు మరల లచ్చి యను దానిని పెండ్లాడెను. పెండ్లాడిన కొద్ది రోజులకే జబ్బుపడెను. అసలే వృద్ధాప్యము. అందులో జబ్బు.

ఒకనాఁడు దొరయింటికి నలుగురు సాయమున అతికష్టముగా నడిచి వెళ్లెను. ఎదురుగా దూరమున కూర్చుండెను.

సోములు—— ఛీ చండాల దర్శనము పొండు! దూరముగా పొండు! అనెను. కాటఁడు దూరముగా తొలఁగి తొలఁగి కూర్చుండెను.

గదిలో జ్వరశయ్యలో నున్న నరసింహులు——ఏమిరా నాయనా! ఏమిటీ? అనెను.



మాలఁడు భక్తిపూర్వకముగా తల నేల మోపెను

ఊహు వింటివా? పాము చెవులు! ప్రొద్దుననే కాటఁడు, మధ్యాహ్నము కాటఁడు, సాయం

* ఇట్టి వాడుకమాటలు ఇందు ఉపయోగింపఁబడినవి.

కాలము కాటఁడు, ముందు కాటఁడు, వెనుక కాటఁడు, కాటఁడు, కాటఁడు! ఎందులకు వచ్చిన బ్రాహ్మణ్యము! అని సోములనెను.

నరసింహులు కఱ్ఱగొని వాకిటికి వచ్చి అరుఁగుపై కూర్చుండెను. మాలఁడు భక్తిపూర్వకముగా తల నేల మోపెను. బ్రాహ్మణుఁడాశీర్వదించెను. ఒకరి నొకరు ఆరోగ్యమును గుఱించి ప్రశ్నించుకొనిరి.

కాటఁడు— దొరా! ఇఁక నేను జీవింపఁగల ననుకొనను. వేదన ఎక్కువగా ఉన్నది. నా కిఁక స్వామిసేవ తీఱిపోయినది. అనెను.



కాటఁడు...నరసింహులయెదుట ఒక మూటను విప్పెను

నరసింహులు కంటినీరు పెట్టుకొని— కాటా! నేనును పిన్నవాఁడనుగాను, నేఁడో ఱేపో నా పయనమును సునిశ్చితము.దాని కేమి? నీ విఁక దుఃఖింపకుము. నారాయణ స్మరణ చేయుము. అనెను.

అదియే ఉపదేశముగా కాటఁడు నారాయణ మంత్రమును గ్రహించి తన కొడుకును దక్క తక్కుఁగల బంధుగుల దూరముగా పొమ్మని నరసింహులయెదుట ఒక మూటను విప్పెను. నూఱు అఱకాసులు. వాని జూపి— అయ్యా! ఇది తమకడ సంపాదించినది. నా కొడుకు ఇఁక సవతి కొడుకు, అక్కఱలో తమరు విచారించి వానికి ఈయఁగోరుచున్నాను! అని మనవి చేసెను.

నరసింహులు కుమారుని బిలిచి ఆ ధన విషయము చెప్పి భద్రపఱిపించెను. కాటఁడు ముమ్మాఱు మ్రొక్కి సెలవుగొని నారాయణ స్మరణము చేయుచు వెళ్ళిపోయెను.

దొర అచటనే కూర్చుండి పలుమాఱులు ఆవలించెను. నరసింహులకు అదియే తుది సెలవుగా కానిపించెనా? అతఁడు నిట్టూర్చి ఆకాశము చూచుచు కూరుచుండెను. అతని కేమియు తోఁపలేదా? ధనముకన్న విలువగల పదార్థ మేమైన పోవుచున్నదా? ఔను. తానును అతఁడును ఒకరి వెనుక నొకరు దున్నిరి. పాండ్రపొలములను సుక్షేత్రములుగా మార్చిరి. రాత్రి చేని గట్లమీద ఒకరివెనుక నొకరు పరుండిరి. నీరు కట్టిరి; కోసిరి; కుప్పలు వేసిరి; నూర్చిరి. అక్కఱలో సంచులు సాయముపట్టి బండ్ల కెక్కించిరి. వారికి ఇండ్లదగ్గఱనే దవ్వు. పనిలో ప్రేమలో ఒకటే చెయ్యి; ఒకటే మనసు.

కాటని బాహుబలమును, దానికన్న మిన్నయగు విశ్వాసమును తన భాగ్యమునకు కారణము. ఆ భాగ్యముచేత నే తాను బవంతి కట్టెను; కాటనికి పూరిల్లు వేయించెను. తాను పెండ్లాడెను. కాటనికి పెండ్లిండ్లు చేయించెను. ఆ భాగ్యముచేత నే తన కుమారునికి చదువు చెప్పించెను; రాముని కిరస్తానిబడిలో చదివించెను. అట్టి కాటఁడు తనకడ నేకాక ఇహలోకము కడ సెలవుగొని పోవుచుండఁగా ధనముకంటె విలువగల ఒకా నొక పదార్థము తనను మఱపించిపోవుట లేదా?

చీఁకటిపడిన తరువాత నరసింహులు కాటని గానఁబోయెను. ఆముదపు దివ్వె వెలుఁగున కాటని కాయమును నరసింహులు కాంచెను. సంతోష దుఃఖములు ఒకే తూరి.

లచ్చి నా గతి యేమి యని నేలకు గోలకు దెచ్చెను. రాముఁడు దొరగారు వచ్చిరని చెవిలో అఱచెను. కాటనికి స్పృహ లేదు. నరసింహులు జ్వరబాధచే వడఁకుచు వెనుదిరిగిపోయెను.

నరసింహులు తన ఆస్తిలో మూఁడవపాలు కాటని కొడుకు రామునికి విల్లువ్రాసి రాముని పిలిపించి యిచ్చెను. రాముఁడు దానిని సోములకడ దాఁచ నిచ్చెను.

స్పృహ వచ్చినపుడు దొరకును పాలేరునకును నారాయణస్మరణము తక్క వేఱు మాట లేదు. శ్మశానాగ్నిలో మంట వెలుఁగున స్వామిభృత్యు లిరువురును ఒకరి నొకరు చూచుకొనుచు పరలోక మేఁగిరి.

౨

సోమలు హైస్కూలులో స్కూలు ఫయినలుదాఁక చదివెను. ఆ హైస్కూలు వైదిక ట్రస్టీల చేతులలో పెరిఁగెను. దాన ప్రతి విద్యార్థికిని మతవిభాగమున సనాతన ధర్మములు, ఇంగ్లీషు టీకతో గీత పఠనీయములు. విభూతి, బిళ్లగోఁచి మొదలగునవి విధులు కావుకాని ఆదరపాత్రములు. సోములు వీనిని ముఖ్యముగా అనుష్ఠించెను. దిగువ తరగతులలో గెలుపొందెనుగాని స్కూలు ఫయినలు అతని దారిలో కొండవలె అడ్డుపడెను. తండ్రి గతించిన పదఁపడి చదువుటకు తీరిక లేక మానివైచెను.

బ్రాహ్మణునకు సేద్యము పాడి గాదని సోముల మతమే కాని రాఁబడిని చూచి ఎత్తివేయలేదు. ఒకటి రెండు సంవత్సరములు అతిక్రమించిన పిమ్మట తాను చెప్పిన కూలి నాలికి ఎవరును రాకుండుట వలనను తన ఆచారమునకు మాలమాదిగలు పనికి రాకుండుట వలనను, 'శూద్ర స్సర్వస్య ఘాతకః' అని శూద్రునం దిష్టము లేకుండుటవలనను, విశేషించి తాను కష్టపడ లేకుండుట వలనను వ్యవసాయపు కాపాటము ఎత్తివేసెను.

రాముఁడు వచ్చి గోడచాటున నిలువఁబడి అయ్యా తమ తండ్రిగారికడ చిన్ననాట నుండియు నాతండ్రి పాలేరు. వారి రెండు స్థానములందు మనమున్నాము. మా నాయన విశ్వాసమే నాకును గలదు. అదియు తమకు

విదితచరము. ఆ దయనే తమరు నా యందు ఉంపుడు. నేను వ్యవసాయ మంతయు చేసెదను. మీరు లోటుపాటులు సవరించుకొనుచుండుడు. అని మనవి చేసెను.

సోములు—ఏమీ? 'వారి' 'మనము' 'మా నాయన'? చిత్తము దేవర యాజ్ఞ! ప్రోత్తిప్రోత్తి! ప్రోత్తిప్రోత్తి!!! చండాలుఁడు నాకు చెప్పుట?

రాముఁడు—అయ్యా! ఒప్పో తప్పో చెప్పితిని. తమకు ఇష్టము లేనిచో పోనిండు! విల్లు నాకు దయచేయుఁడు. నా కిచ్చిన పొలమును పాలుకిచ్చితిరి. దానినే ఖాయపఱిచి



నా అనుమతి లేకుండ విల్లు వ్రాయుటకు
నా తండ్రికేమి హక్కు?

ఆ అంబారము నా కిప్పింపుఁడు. కాదందురా ఈయేడు తమరే తీసుకొని ముందటికి నాకు విడుదల చేయు డనెను.

సోములు— ఏమిరా? నా అనుమతి లేకుండ విల్లు వ్రాయుటకు నా తండ్రి కేమి హక్కు? దొంగలూ దొంగలూ కలిసి ఊళ్ళు పంచుకొనిరఁట! చాలు నీమర్యాద. నీ మొగము చూడరాదు. ఛీఛీ లేచి పో! చేతనగుచో వ్యవహారము చేసికో. మరి మాటాడకు. అని లోపలి నుండి విల్లు తెచ్చి ముక్కముక్కలు చేసి వానిమీఁద పాఱవైచెను. మరి రెండు బిట్టె లోనికిఁబోయి తలుపులు మూసికొనెను.

రాముఁడు ఆకాకితపు ముక్కలకేసి చూచుచు చాలసేపు నిలువఁబడెను. నిలువఁబడి నిలువఁబడి ఆ ముక్కల నన్నిఁటిని పోగు చేసెను. ఆతఁడు రొండి తడుముకొన లేదు. చుట్ట కాల్చడు కాన అచట నిప్పుపెట్టె ఉండదు. ఇంటికి పరువున వెళ్ళివచ్చి ఆ ముక్కల ప్రోవునకు నిప్పుపుల్లగీచి అంటించెను. అది నిమిషమాత్రమున కాలిపోయెను. రాముఁడు వెను దిరిగి చూడక వెళ్ళిపోయెను. రయిమని గాలి తోలి ఆ కాలిన ముక్కలు ఎక్కడి వక్కడ కొట్టుకొని పోయెను. అసట దాని చిహ్నము కూడ లేదు.

సోములు రాత్రి సగపడ భోజనమయిన వెనుక రివ్వున లేచి వాకిటికిఁ బరువిడెను. ఇటులు పరువెత్తుట పాతికె సారు లాయెను గాన భార్య భయపడ లేదు గాని పిచ్చియెత్తెనేమో యనిమాత్ర మనుకొనెను. సోములు కాగితపు ముక్కలు వెదకెను. ఒక ముక్కయేని ఆ యంధకారమున గానిపింపలేదు.

ఈ లోపుగా భార్య లాంతరు గొని వెళ్లెను. ఇపు డా వెలుఁగున సోములకు మరి కాస్త అంధకార మధికమే ఆయెను. అతఁ డాకాశముదిక్కు-చూచి పిడికిలించి విధవ! వాఁ డెత్తుకొనిపోయినాఁడు. కానీ! కోర్టున్నది. వాఁ డున్నాఁడు. ఈ యాస్తి వెల ఎంతయుండునో అంతయు వ్యయము చేయింపక దీనిని వానికి దక్కనివ్వను అనుకొనుచు లోనికేఁగెను.

భార్య అనుగమించుచు 'మీరు విల్లు చింపితిరని నేరము రాదుకదా కొంప తవ్వి?' అనెను.

సోములు అరుణనయనములతో, ఉబ్బిన నాడులతో అదరు ముకుజెమరలతో భార్య కేసి చూచెను.

3

లచ్చి యింటనున్న దెల్లయు పుట్టినింటికి నడపెను-ఇంటిపై నున్న కలప తప్ప. సవతికొడుకుతో కయ్యము పెట్టుకొనెను; అతఁడు మాత్రము కిఁచులాడలేదు. కావున రెండు పక్షములను తానే పోరాడెను.

రాముఁడు తల్లిని బతిమాలుకొనెను. లచ్చి వినలేదు. ఇంటిలో సగమైన ఇమ్మని పోరుపెట్టెను. రాముఁ డిచ్చెను. వార్రిఁత కోఁత లయిన పిదప కుండయు కర్రియు తీసికొని రామునితో చెప్పకుండ పుట్టినింటికి లేచిపోయెను. కొలఁదినాళ్లకే లచ్చి యన్నఁదమ్ములు వచ్చి ఆయిల్లు సోముల కమ్మివైచిరి.

రాముడు లోగడ అన్నము లేకపోవు టెఱుఁగఁడు. వండుకొనుట అసలే యెఱుఁగఁడు. రెణ్నాళ్లనుండి ఉపవాసము.

ఈ యవస్థయంతయు బడిలో అతనితో చదువుకొన్న రెబెకా చూచెను. తలిదండ్రులకు తెలియకుండ అన్నము తెచ్చి నిద్రించుచున్న రామునిముంగల పెట్టెను. పరికించి చూచి వెళ్లిపోయెను. ఆదారిని బోవు పాదిరీతప్ప ఆవిషయ మితరు లెఱుఁగరు.

కొంతవడికి రాముఁడు మేలుకనెను. అన్నముచూచి—ఆహా భగవానుఁడా! నా యెడ నీ కెంత దయ! నా యాఁకలికూడ నీకు తెలిసెనా? అనెను.

అతని కన్నులనుండి నీరు జల జల రాలెను. వాకిటికి వచ్చి చూచెను. ఎవరును లేరు. భగవన్నామోచ్చారణము చేయుచు అన్నముముందు కూర్చుండి భుజించుచుండెను. కంచె యావలినుండి రెబెకా రెండుకన్నులును రామునిపై బడెను. రాముఁడును రెబెకాను చూచెను. ఆచూపులో అన్నదానముకన్న ఆత్మదాన మెక్కుడుగాఁ గానిపించెను. వినయపూర్వకముగా తలవాల్చెను. రెబెకా తలవంచి చిఱునవ్వుతో లోనికేఁగెను.

రాముఁడు రెబెకాకు అన్నమిడు నవకాశము మరల ఈయలేదు. కాని చూచుటకు మాత్ర మీయకపోలేదు. రెబెకా రాముల రహస్య ప్రసంగములను రెబకా తలిదండ్రులు అవరోధింపలేదు. రెబెకా రాముని

కిరస్తాని మతమున కలియు మనెను. రాముఁడు కిరస్తాని మతమున నేమి యని యడిగెను. రెబెకా చెప్పలేకపోయెను. రాముఁడు లోతుగా చూచెను.

ఒకనాఁడు ఫాదరీ రెబెకాతండ్రి విశాఖను (Isāac) పిలిపించి-నీకుమూర్తే రాముని ప్రేమించుచున్నట్లు నాకు తెలియును. దానికి నా ముద్దులు చెప్పవలెను. అయితే రాముని ఎంత వడిగా కిరస్తాని మతమున కలుపఁగలుగుదువో అంతవడిగా పెండ్లి చేసికొనవచ్చును. మీ రం దఱు కలిసి ఏసు దయచే అతనిని వెంటనే మతమున కలుపుఁడు; పొండు. ఇదిగో, మతములో కలిసిననాఁడే వాఁడు పరతులు. నీకూఁతురు పరతులమ్మ. తెలిసినదా? అనెను.

ఈ వార్త తెలుపుటకు విశాఖ రాముని కడకు వెళ్ళెను. రాముఁ డాలోచించుకొనుచు కూరుచుండెను. విశాఖ రాఁగానే లేచి గౌర వించి కూర్చుండఁబెట్టెను.

నీవు వెంటనే మతము పుచ్చుకొనవలె నని విశాఖ. ఏల? యని రాముఁడు. పుచ్చుకొ ననిచో రెబెకా నీయ వీలులేదని విశాఖ. నేను గర్భదరిద్రుఁడను; మతమున కలిసిన మాత్రమున ఇత్తువా? అని రాముఁడు. ఆ మాటల కేమి? మతము స్వీకరించుచో పరతాలవగుదువు; మా అమ్మాయి పరతులమ్మ యగును అని విశాఖ.

గంభీరముగా ఆలోచించి రాముఁడు నే సరే ఆలోచింతు ననెను. ఏసంగతియు రేపు చెప్పుమని విశాఖ యనెను. రాముఁడు సరి యనఁగా విశాఖ వెళ్ళిపోయెను.

రాముఁడు వెంటనే సోములకడకు వెళ్ళి అయ్యా! నాకు అన్యమతమున కలియవలసి వచ్చిన దుర్గతి పట్టినది. మా నాయన మీ కడ దాఁచినధన మీయఁగోరుచున్నాను అనెను.

విధవవు! నీవు! నీ కొఱకు అన్యమతము! నీవు మతములో కలిసినంతమాత్రమున మా మతమునకు ఏమియు ధోకా లేదు లే.

అయ్యా! ఆ మాట అటుంచుఁడు. డబ్బు మాట చెప్పుఁడు.

ఆ మాట చెవులఁ బడఁగనే సోములు కనులెఱ్ఱజేసి లోనికి బరుగెత్తి రివాల్వరు తెచ్చెను. తల్లి వెనువెంటనే వచ్చి నేరుపుగా లాఁగికొని నూతఁ బాఱవైచెను. సోములు చండాలప్రేమ అని తల్లిని తిట్టి నూత దిగు ప్రయత్నమున నుండెను.

రాముఁ డచటినుండి పద్మనాభశాస్త్రి గారియింటికి వెళ్లెను. 'శుని చైవ శ్వపాకేచ బ్రాహ్మణా స్సమదర్శినః' 'శుని అంటే కుక్కయందునా నున్నూ శ్వపాకే అనఁగా కుక్కలు తినే మాలమాదుగలందునా నున్నూ బ్రాహ్మణులకు ఒకటే చూపు' అని వినఁబడుచుండఁగా ఉపశాంతి కలిగి దూరముగా కూర్చుండెను. పద్మనాభశాస్త్రి రాముని చూచి పాఠము చెప్పుట చాలించి పదిమంది శిష్యులతో బయటికి వచ్చెను. రాముఁడు దండప్రణామము చేసెను.

శిష్యులందఱు పక్కున నవ్విరి. పద్మనాభ శాస్త్రికి కోపము పెరిఁగెను. వాడలోని బ్రాహ్మ



“బ్రాహ్మణులందఱు వచ్చి నాళ్లనడుమ కేలవచ్చితివని రాళ్లు రువ్వి కఱ్ఱలు విసరిరి.”

ణులందఱు వచ్చి నాళ్లనడుమ కేల వచ్చితివని రాలు రువ్వి కఱ్ఱలు విసరిరి. రాముఁడు దెబ్బలు సహించుచు మాటాడక వెళ్లిపోయెను.'

రాముఁ డింటికిఁబోయి ఇఁక అన్నము తినవచ్చును, బైబిలు చదువుకొనవచ్చును అని అనుకొనెను.

రాముఁ డామఱునాఁడే మతమున కలిసి జకరయ్య యాయెను. 'ఆమఱునాఁడే రెబెకాను పెండ్లాడెను.

౪

జకరయ్యకు బైబిలుచే నోరు నిండెను గాని అన్నముచే కడుపు నిండలేదు.

రెబెకా జకరయ్య లిరువురు నెలరోజులు రెండుపూఁటలు ఫాదిరీ యింటిచుట్టూ తిరిగిరి. ఫాదిరీ తనకు నూటయేఁబది రూపాయ లిచ్చుచో పాతికె రూపాయల ఉద్యోగము నిప్పింతుననెను.

అయ్యా! అన్నముచే కడుపు నిండుట యొకటి; బైబిలుచే నోరు నిండుట యొకటి. ఈ రెండును నన్ను కిరస్తాని మతమునకు గుంజినవి. నేను పూటకూటికి టికాణా లేనివాఁడను. నూటయేఁబదిరూక లీయఁగలుగుట ఈ జన్మమున ఇఁక నసంభవము.

జకరయ్యా! ఓటిమాట ఎందుకు? నీ కెంత డబ్బున్నదో ఎవరివద్ద నున్నదో మాకు తెలియదా? కాటఁడూ కాసులమూటా అందఱకు తెలియును.

అయ్యా, కాదు కాదు. కాసులమూట మాట నిక్కమే. మా నాయన అప్పుండి వారి కిచ్చివేసెను గాని అది మాది కాదు.

ఫాదిరీ నవ్వి ప్రకృతము ఆఱురూపాయలకొకటి అయిదు రూపాయలకొకటి ఖాళీ ఉన్నవి మీ యిద్దఱు ప్రవేశింతురా? అనెను.

రెబెకా జకరయ్యలు, సంతోషపూర్వకముగా అంగీకరించి వెళ్లిపోయిరి.

వారు దూరముగా వెళ్లుటచూచి ఫాదిరీ కంటిజోడు మేజాబల్లమీఁదఁ బెట్టి— తెలివి తక్కువవారు— ఫూల్ స్— ఇపు డేమయి నది? ఒకటి ౧౫, మరొకటి ౧౦ వెరసి ౨౫. వీరికిచ్చునది౧౧ తీసివేయఁగా ౧౪. ౨౧౪ లు = ౧౬౮. ౧౫౦ ఇమ్మనఁగా సకల అబద్ధములూ ఆడినాఁడు. ఇపు డిఁక ఏటేట నూట అరువది యెనిమిది రూపాయలు అక్షరాలా యిచ్చునుఁగాక అని అనుకొని గుడిలోనికి వెళ్లి పోయెను.

రెబెకా జకరయ్యలు పంతులమ్మగాను, పంతులుగాను ప్రవేశించిరి. రెబెకాకు పది, జకరయ్యకు పదియేను, అసలు జీతము. ఇది వారెఱుఁగరు. ఫాదిరీ వారికి గురుదేవుఁడు.

ప్రతి ఆదివారము రెబెకా జకరయ్యలు చెరియొక పావలా ఏసుపేర ముడుపీయవలసి యుండెను. మరియు మరికొన్ని పండువులలో మరికొన్ని ముడుపులు కట్టవలసియుండెను. ఈ విషయమంతయు పర్యాలోచింపఁగా కుడిచేతితో ఇచ్చి ఎడమచేతితో లాఁగికొనినటు లుండెను. వీనికి చెల్లఁగా మిగిలిన ద్రవ్యము వారిరువురి పొట్టలకు చాలలేదు. ప్రొద్దుగ్రుంకులు బడిలో వాగి వాగి యింటికడ వారికి వాకట్టు.

ఫాదిరీ తమ జీతములో సగము హరించుచున్నటులు జకరయ్యకు కర్ణాకర్ణికగా తెలిసెను. జకరయ్య మొదటమొదట నమ్మలేదు కాని పిదపఁబిదప సత్యము తెలిసికొనఁగలిగెను.

జకరయ్య ఒకనాఁడు ఫాదిరీ దర్శనమునకు వెళ్లెను. అతఁడు బైబిలు చదువుకొనుచుండెను. జకరయ్య వందనముచేసి తన దైన్యమును చెప్పికొని ప్రకృతము జరుగుచున్న అన్యాయమును పైకి పోనీయకుండ సర్దుపాటు చేసి తనను అనుగ్రహింపవలసినదనియు మతముయొక్క సత్యమునకు తాము తండ్రులనియు మనవిచేసికొనెను.

ఫాదిరీ చిఱునవ్వుతో—ఓరీ! మేము ఏసు కులమువారము, సాక్షాత్తు వారికి శిష్యులము. మీకును ఏసునకును సాక్షాత్సంబంధము లేదు. మాగుండా మీరు ఆ యేసుప్రభువు గుడి వాకి

"మీ నల్లవారందరు మాకు బానిసలు. బానిసలయందు ఉంచవలసిన దయ మాయందు చాలఁగలదు."

టికి మాత్రము వెళ్లఁగలరు. మీ నల్లవారందరు మాకు బానిసలు. బానిసలయందు ఉంచవల

సిన దయ మాయందు చాలఁగలదు. నేను చేయగలిగినంత ఉపకారమును చేసివేసితిని. ఇఁక నా చేతిలో ఏమియు లేదు. అనెను.

జకరయ్య తలవాల్చి—And unto him that smiteth thee on the one cheek offer also the other; and him that taketh away thy cloke forbid not to take thy coat also—అని లోలోపల అనుకొనెను. ఫాదిరీవద్ద సెలవు పుచ్చుకొని వెళ్లిపోయెను.

కొలఁది రోజులలోనే రెబెకా జకరయ్యలకు ఉద్యోగము ఉద్వాసిత మయినటులు తెలిసెను.

రెబెకా ఆనాఁడు భర్తతో కిరస్తాని మతము కానిమతము అనెను. జకరయ్య చిఱునవ్వు నవ్వి నేను పద్మనాభశాస్త్రిగారి యింటికి వెళ్లినపుడు వారు 'శుని చైవ శ్వపాకే చ పండితా స్సమదర్శినః' అని చదువుచు నన్నుచూడఁగనే తన్ని తగిలినారు. ఫాదరీని చూడ వెళ్లినపుడు వారు 'For whosoever shall do the will of my Father which is in heaven, the same is my brother, and sister, and mother' అని చదువుచున్నారు. నాకు అన్యాయము చేయవలదని వేఁడుకొనఁగా మీకును ఏసునకును సాహోత్సంబంధము లేదు; మాగుండా మీరు ఏసుప్రభువు వాకిటికిమాత్రము వెళ్లఁగలరు. మీ వల్లవారందఱు మాబానిసలు అని తెగడెను. పైని డిస్మిస్ చేయించెను. కావున ఏమతములో తప్పు గలదు మనుష్యునిలోఁ గాక? మానవులకందఱకు ఒకటే మతము కలదు—సమదర్శిత్వము అనెను.

ఆనాఁడు వారికి ధర్మప్రసన్నములతో సరి పోయెను. వారికి దైవందినము గీతాబైబిలుల పారాయణఫలముతో పాటు ఉపవాసవ్రతఫలమును సంపూర్ణముగా లభించుచుండెను.

౫

జకరయ్య ఉదరపోషణకు కాపు భోగయ్య నాశ్రయించెను. ఆశ్రయింపగా నాశ్రయింపగా ఈ క్రింది పత్రము కుదిరెను—"సేద్యమునకు కొంత పొలమిచ్చి పెట్టుబడి పెట్టుట; పంట సాఁబాలు; పెట్టుబడిలో పాలుకు ఏఁబదిరూకలు చెల్లుపెట్టుట; పెట్టుబడిమీఁద రూపాయి తొమ్మిదణాల సాలుసరి కాంపౌండు వడ్డీ; ఇల్లూ దొడ్డి తాకట్టు." ఈనియమములతో జకరయ్య ఱెక్క కట్టి పొలమున అడుగుపెట్టెను.

జకరయ్య రెండుజాముల పట్టపగలున్నఁగా సాయంకాలము వఱకు రెబెకా ఎడ్లమేపును. భర్త మోట తోలఁగా భార్య నీరు కట్టును. వారిరువురును చోడినారు పోసి పెంచి ఊడ్చిరి; మిరపతోఁట పెట్టిరి; పొగాకుతోఁట వేసిరి. రాత్రి రెబెకా రాటముమీఁద నూలుతీయుచు భర్త బైబిలు చదివి చెప్పఁగా ఆలకించుచుండెడిది.

జకరయ్యకు పాటకపు జాతిలో పలుకుబడి ప్రబలము. బిషప్పు వచ్చినపుడెల్ల అతని కొకనాఁడతిథి.

ఈ గౌరవములలో అతఁడు తన సేద్యమును మఱవలేదు.

ఒకనాఁడు రైలులో సోములును పాదిరీయు కలిసిరి.

జకరయ్య మీ మీఁద పిటీషను పెట్టనను కొనుచున్నారు.

దానికేమి? మీవిల్లుముక్కలు కోర్టుకెక్కునట.

జకరయ్య దుర్మార్గుఁడు.

జకరయ్య ఇన్‌ఫిడెల్, పతితుఁడు.

వానిని వంచుటకు ఏమి ఉపాయము?

మీకు చేతనైన ఉపాయము చేయుఁడు; నేను మీకు భయము రాకుండ జేయుదును. మిషనరీకి ఎంతప్రభావమున్నదో మీ రెఱుఁగరా?

ఎఱుఁగుదును ఎఱుఁగుదును. మిమ్ము నమ్మనా?

క్రీస్తుమీఁద ఒట్టు.

ఇరువురును రైలు దిగి పోయిరి.

పంటలు చక్కగా పండెను. పైరకు పైరొ ఆగి నేలమీఁద వాలుచున్న రామచిలుక దండు రెక్కలవలె నుండెను. పొగాకు మొక్కలు 'నన్ను కాల్పవలదు నన్ను కాల్పవలదు' అను చందముగా వెడఁదబారు టాకులతో చేతులొగ్గి నిలువఁబడెను. తవీద యూకులు తమ లక్ష్మినంతయు ఎన్నులకిచ్చి దివాలాతీసెను.

రేపు లేక ఎల్లుండి కోయవచ్చుననఁగా భూతములలో కల్లోలము పుట్టెను. గాలి చెలరేఁగెను. మబ్బులు కమ్మి తఱిమి తఱిమి ఉఱిమెను. పాములవలె మెఱుపులు, ఫిరంగిగుండ్లవలె పిడుగులు, తుపాను. తన కూఁతురైన భూమిని జలము పెద్దపులివలె గ్రసించెను. జడములకేటి పాడి?

జకరయ్య ఈ వ్యత్యయములో జైనాచార్యులవలె జగదనిత్యతను తెలిసికొనెను.

పదిరోజులకుఁగాని భూతములకు సమత్వము కలుగలేదు.

జకరయ్య భోగయ్యవాకిట నిలిచెను. భోగయ్య దైవికముగా పంట పాడగుటకు చింతించెను. పిదప ఇట్లనెను—నీవు బాకీ తేల్చలేవు, ఈ సాలుకు పెట్టుబడిలో ఈయవలసిన ఏఁబది రూకలు తెచ్చి యిచ్చుచో పొలము నీ క్రింద నుండునటులు చూతును. పండినను ఎండినను మిషనరీవారు నీకంటె ఎక్కువ డబ్బు ఇత్తుననిరి, వారి కిచ్చెదను.

అయ్యా! నే నీయఁగలుగుదు ననియే అడిగితిరా?

నన్నిఁక నేమియు అడుగవలదు. చేతనైనచో పైకము తెమ్ము.

జకరయ్య మాటాడలేదు. భోగయ్య సమాధానముతో పనిలేక కాఁబోలు లోనికి వెళ్లిపోయెను.

రెబెకా యింటికి వచ్చిన భర్తముఖము చూచి స్థితిగతులు మాఱెనని తెలిసికొనెను.

అతనికి అన్నమిడుట కింట నూకలులేవు. నూలు కండెలమ్మి నూకలు తెచ్చుటకు సాలెయింటికి వెళ్లెను.

అతఁ డొంటిగా కూర్చుండికూర్చుండి వగచి వగచి యింటిలో అటిటు తిరుగుచుండెను. అపుడచటికి విశాఖ వచ్చెను. అల్లుమామలు కూర్చుండిరి.

జకరయ్యా! మీనాయన నరసింహులుగారి కడ కాసులమూట దాఁచినట్లు వినుకలి. అదియు గాక నరసింహులుగారు నీకేదో విల్లువ్రాసి యిచ్చినటులును వాడుక. దానివలననే నీకు మేము పిల్లనిచ్చితిమి. ఇట్టి కఱవులో ఆ ధన మేల తెచ్చికొనవు? నీకు పిఱికితనమాయె నేని నే నడిగివచ్చెదను.

నేను పెండ్లికాకమునుపే గర్భదరిద్రుఁడ నంటిఁగదా! కాసులమూట నీటిమూట. విల్లు పొల్లు.

విశాఖ ఆ మాటలు నమ్మలేదు. లేచి సోముల యింటికి వెళ్లెను. ఆ యింటికి తాళము. జలప్రళయమునకు అతఁడు కొండదరి తోఁట లోనున్న యింటిలో కాఁపురముండెను. విశాఖ అక్కడికి వెళ్లెను. సోములు విశాఖనుచూచి తగవులాడ వచ్చె ననుకొనెను. అటులే యయ్యెను. క్రమముగా తగవు పెరిఁగెను. సోములు లోనికేఁగి తలుపులు మూసికొనుచు- ఆకాకితపుముక్కలను తీసికొని వాని నొంటిగా నాకడకు రమ్మనుము అని అఱచెను. విశాఖ సరియని వెళ్లెను.

సోములు దూరముగానున్న జకరయ్యను చూచెను. వస్త్రము కప్పుకొని అరుఁగుమీఁద కూర్చుండెను. అతనికనులు చండ్రనిప్పులు. నరములు ఊఁదుతిత్తులు. మొగము కొలిమి. జకరయ్య నమస్కరించి నేలమీఁద దూరముగా కూర్చుండెను.

కాకితపుముక్కలు తెచ్చితివా?

అయ్యా! నాఁడే తగులఁబెట్టితిని. మీకు ఆ సందేహము పోగొట్టుటకే వచ్చితిని.

ఈయవా? ఈయవా?

నిక్కము. తగులఁబెట్టితిని.



“కొండపై ప్రతిధ్వనింపక మునుపే జకరయ్య నేలపై వ్రాలెను.”

ఇదిగో మా నాయన కళంకము మాపెదను. అని సోములు బట్టచాటున నున్న పిస్తోలు నెత్తెను.

ఏసు మిమ్ము రక్షించుఁగాక!

నీ యేసు నిన్నే రక్షింపలేఁడుచూడుము అని సోములు పేల్చెను. కొండ ప్రతిధ్వనింపక మునుపే జకరయ్య నేలపై వ్రాలెను. సోములు దగ్గఱకు వెళ్లి చూచెను. ఒక కాకితపు ముక్కయు లేదు. సోములు పాఱిపోయెను. జకరయ్య కష్టముగా లేచి ధూరముగా వెళ్లి లోయలో పడిపోయెను.

క్రమక్రమముగా గ్రామమంతయు గుమికూడెను. రెబెకా బియ్యపుమూటతో వచ్చి కాళ్లకాడ కూర్చుండి అతని మోమును నిబ్బరముగా చూచుచుండెను. అతనియత్తమామలు సోములను తిట్టుచు ఏడవఁదొడఁగిరి. జను లందఱు ఇంటిలోని కుఱికిరి. శూన్యము.

పోలీసువారు వచ్చిరి. వారిమాట వినఁబడఁగనే జకరయ్య కనులు తెఱచెను. ఇన్స్పెక్టరు దగ్గఱకు వెళ్లి నీ మీఁద పిస్తోలెవరు పేల్చిరి? అని అడిగెను.

జకరయ్య—నేనే

ఇన్స్పెక్టరు పెదవి నిఱిచి—ఎందులకు?

జకరయ్య—కేవలము నేనే నేనే నేనేఅని శ్వాసలు విడిచెను. రెబెకా మూర్ఛిల్లెను.

సుధాకర తత్త్వము

విక్రమదేవవర్మ గారు

సుధ యన నమృతంబు సున్నంబు నౌసుధా
కరుఁ డనంగ ధవళకిరణుఁడ సుమి
సుధ కిర వను సుద్ది సూరికల్పిత మగు
నమృతమునకు వసతి యగునె గ్రహము?